సమావేశంలో మాట్లాడుతున్న ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాసులు

చేనేత వస్త్ర నిల్వలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

● ఓయూ ప్రొఫెసర్లు

భూదాన్‌పోచంపల్లి, జూలై 13 : చేనేత సహకార సంఘం, మాస్టర్ వీవర్ల వద్ద నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసి కార్మికులను ఆదుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు కోరారు. శనివారం పోచంపల్లి చేనేత సహకార సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో పోచంపల్లి చిటికి, చేనేత పరిశ్రమపై అధ్యయనం చేసేందుకు కొయ్యలగూడెం, నారాయణపురం, గట్టుప్పల్, పుట్టపాక, చండూరు గ్రామాల్లోని చేనేత కార్మికుల ఇండ్లను ప్రతినిధుల బృందంతో కలిసి సందర్శించినట్లు చెప్పారు. పోచంపల్లి చిటికి పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై కార్మికులు, మాస్టర్ వీవర్లు సహకార సంఘం ప్రతినిధులతో కలిసి అధ్యయనం చేశామని వివరించారు. చేనేత చిటికీలో డూప్లికేట్ వస్త్రాలను నిషేధించాలని, చేనేత రిజర్వేషన్ చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత పరిశ్రమ సంక్షోభం మూలంగా చేనేత కార్మికులకు నెలలో 15 రోజులు మాత్రమే పని దొరుకుతుందని, మిగతా రోజులు పనులు లేక పస్తులతో ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలన్నారు. త్రిఫ్ట్ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా గత సెప్టెంబర్ నుంచి బకాయిలు ఉందని, దానిని చెల్లించాలని, 40శాతం నూలు సబ్సిడీ పథకం వెంటనే పునరుద్ధరించాలని, జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేసిన వస్త్రాలకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో కోట్లాది రూపాయల వస్త్ర నిల్వలు పేరుకుపోయాయని, దాంతో కార్మికులకు పని లేక వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. సమావేశంలో చేనేత జనసమాఖ్య జాతీయ నాయకుడు మాచర్ల మోహన్‌రావు, ప్రొఫెసర్ తడక యాదగిరి, కేకే. రామారావు, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, చేనేత నాయకులు ఏలె భిక్షపతి, చిక్క కృష్ణ, గంజి బసవలింగం, కర్నాటి పురుశోత్తం, వేషాల మురళి, గజ్జల రామకృష్ణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై అధ్యయనం

చౌటుప్పల్‌రూరల్ : చేనేత పరిశ్రమ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసేందుకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు శ్రీనివాస్, తడక యాదగిరి శనివారం మండలంలోని కొయ్యలగూడెం గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని చేనేత కార్మికుల ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వస్త్రాల తయారీ విధానం, వాటికి అయ్యే ఖర్చు, కొనుగోళ్లు వంటి వాటిపై వివరాలు సేకరించారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

విరివిగా మొక్కలు నాటాలి : జడ్పీ సీఈఓ

భువనగిరి కలెక్టరేట్, జూలై 13 : వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విరివిగా మొక్కలు నాటి, ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించాలని జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి సూచించారు. శనివారం మండలంలోని వడాయిగూడెం గ్రామంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాల్లో, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె. ఆమని, ఫీల్డ్ అసిస్టెంట్ బబ్బూరి శంకర్‌గౌడ్, గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

వలిగొండలో ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కేంద్రం ఏర్పాటు చేయాలి

● సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట(వలిగొండ), జూలై13 : మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు మాట్లాడుతూ మండల కేంద్రంలో ట్రాన్స్ ఫార్మర్ రిపేర్ కేంద్రం లేకపోవడంతో రైతులు తమ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే భువనగిరి, రామన్నపేటకు తీసుకెళ్లాల్సి వస్తుందని తెలిపారు. దాంతో రైతులపై ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, చీర్క శ్రీశైలంరెడ్డి, మెరుగు వెంకటేశం, కొండె కిష్టయ్య, కందాడి సత్తిరెడ్డి, కవిడె సురేశ్, దుబ్బ లింగం, దొడ్డి భిక్షపతి, రాదారపు మల్లేశం, జక్క రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సాత్విక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● ధ్యాన మహర్షి మురళి

సదస్సులో మాట్లాడుతున్న మరళి

భువనగిరి కలెక్టరేట్, జూలై 13 : సాత్విక ఆహారం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ధ్యానర్షి మురళి సూచించారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన మహ శాకాహార ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ జీవహింసను విడనాడి శాకాహారులుగా జీవనం సాగించి మానవీయ విలువలను పెంపొందించుకోవాలన్నారు. శ్వాసపై ధ్యాసను పెంపొందించుకొని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలన్నారు. గణేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

దుప్పెల్లి గ్రామానికి అంబులెన్స్ అందజేత

రామన్నపేట(వలిగొండ), జూలై13: బాబూ జమాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని దుప్పెల్లి గ్రామానికి అంబులెన్స్‌ను అందించారు. ఈ అబులెన్స్ సర్వీస్‌ను శనివారం టీజేఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య కోదండరాం ప్రారంభించారు. అంబులెన్స్ అందించిన ఫౌండేషన్ వారిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ గంధం వెంకన్న, నాయకులు జావెద్, సలీమ్, నరిగె యాదయ్య, బాలగోని సత్యనారాయణ, భిక్షపతి, మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

రామన్నపేట(వలిగొండ), జూలై13: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పొద్దటూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొద్దటూర్ గ్రామానికి చెందిన కూర శివ(26) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామ నిర్వహించారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించామని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు

లక్ష్మీనరసింహుడికి నిత్య తిరుకల్యాణం

యాదగిరిగుట్ట, జూలై13: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ తంతును వీక్షించారు. స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహుడిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు.

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 37,13,912 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి శైలేంద్రకుమార్ జోషికి స్వామివారి ప్రసాదాన్ని అందిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి, మంచిర్యాల ఎస్పీ భాస్కర్, ప్రముఖ న్యూమరాలజిస్ట్ దైవజ్ఞ శర్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి సంప్రదాయ స్వాగతం పలికి, వేద ఆశీర్వచనం చేశారు. ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

15న సామూహిక గిరిప్రదక్షిణ

స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతీ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఈ నెల 15న ఉదయం 6.05 గంటలకు సామూహిక గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొంటారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గిరిప్రదక్షిణ అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా కొండకింద గిరిప్రదక్షిణ మార్గం, దేవస్థాన వసతి గృహాలు, సాంస్కృతిక పాఠశాల ఆవరణలో, గోశాల ప్రాంతాలలో మొక్కలు నాటనున్నట్లు ఆయన తెలిపారు.

స్వామివారి పాదాల వద్ద అసంపూర్తిగా ఉన్న గిరి ప్రదక్షిణ దారి

గిరి ప్రదక్షిణ రోడ్డులో అడ్డంకులు

● రోడ్డుకంటే ఎత్తుగా విద్యుత్ అండర్ గ్రౌండ్ కేబుల్

యాదగిరిగుట్ట, జూలై13: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గిరి ప్రదక్షిణ రోడ్డుకు పలు ప్రాంతాల్లో అడ్డంకులు ఎదురవుతున్నాయి. రోడ్డు మరమ్మతు పనులు అసంపూర్తిగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొండ చుట్టూ 2.5 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ రోడ్డుకు పార్కింగ్ టైల్స్, ఇరువైపులా విద్యుత్ దీపాలు, మైకులు అమర్చినా, స్వామివారి పాదాల వద్ద మాత్రం అసంపూర్తిగా ఉంది. కొండపైకి విద్యుత్ సరఫరా చేసేందుకు అండర్ గ్రౌండ్ కేబుల్స్‌ను వేయగా అవి ఎత్తుగా ఉండి గిరిప్రదక్షిణ రోడ్డుకు అడ్డుగా మారాయి. వృద్ధులు, మహిళలు, చిన్నారులు గిరిప్రదక్షిణలో పాల్గొంటే ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. దానికి తోడు స్వామి వారి పాదాల ప్రాంతంలో పందులు సంచరించి ఆప్రాంతాన్ని అపరిశుభ్రం చేస్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దేవస్థాన అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నేతన్నల ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

● చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనర్సు

మోత్కూరు, జూలై13 : పనులు లేక, పూట గడువక, అప్పుల పాలై నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ఈదులూరుకు చెందిన నేత కార్మికుడు ఏలె శంకరయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఆయన మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్లే చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు పనులు లేక పూట గడవక అప్పుల పాలై పస్తులుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి శంకరయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట నర్సింహ్మ, బాలనర్సయ్య ఉన్నారు.

21న సాయి బృందావనంలో గురుపౌర్ణమి వేడుకలు

భూదాన్‌పోచంపల్లి, జూలై 13 : మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలోని సాయి బృందావన క్షేత్రంలో ఈ నెల 21న గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఫౌండర్ చైర్మన్ ఘంట నారాయణ స్వామి గురూజీ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా సాయిబాబా, పాదశ్రీ వల్లభ స్వామి, నరసింహ సరస్వతీస్వామి, మాణిక్ ప్రభు, స్వామి సమర్థ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మాజీ ఎంపీపీ అమరావతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు

గుండెపోటుతో గుండాల మాజీ ఎంపీపీ మృతి

ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల నివాళి

అమరావతి(ఫైల్)

గుండాల, జూలై 13: గుండాల మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి(27) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. తెల్లవారు జామున బాత్రూంలోనే గుండె పోటుతో కుప్పకూలిపోగా.. గమనించిన భర్త శోభన్‌బాబు ఆమెను చికిత్స నిమిత్తం జనగామకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మరణించారు. అమరావతి 2019లో మరిపడిగ-గంగాపురం ఎంపీటీసీగా గెలుపొంది.. ఎంపీపీగా ఎన్నికయ్యారు. చిన్న వయస్సులోనే ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి మండలాభివృద్ధికి కృషి చేశారు. 10 రోజుల క్రితం తన పదవీ కాలాన్ని పూర్తి చేసుకు న్నారు. అమరావతి మృతితో మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నివాళులర్పించిన ప్రముఖులు

తాండ్ర అమరావతి పార్థీవ దేహాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవ రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ఎండీ.షర్ఫొద్దిన్, మాజీ ఎంపీపీలు హరితాదేవి, ద్యాప కృష్ణారెడ్డి, సంగి వేణుగోపాల్, చిమ్ముల సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు మండడి రామకృష్ణారెడ్డి, గడ్డమీది పాండరి, కోలుకొండ లక్ష్మీ, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.ఖలీల్, గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, నాయకులు మూగల శ్రీనివాస్, ఈరసరపు యాదగిరిగౌడ్, ఏలూరి రాంరెడ్డి, దుంపల శ్రీనివాస్, బాల్‌రెడ్డి,అడ్వకేట్ రహీం నివాళులర్పించారు. అనంతరం మండలంలోని మరిపడగ గ్రామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలు

భూదాన్‌పోచంపల్లి, జూలై 13: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన శనివారం సాయంత్రం పోచంపల్లిలోని జీబీఆర్ గార్డెన్ వద్ద చోటు చేసుకుంది. అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన ముగ్గురు యువకులు ఒకే బైక్‌పై గౌరెల్లి నుంచి భూదాన్ పోచంపల్లికి బయల్దేరారు. జీబీఆర్ గార్డెన్ వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో బైక్ రోడ్డు కిందికి పడిపోయింది. దాంతో బైక్‌పై ఉన్న నిఖిల్, సమీర్‌కు గాయాలయ్యాయి. మరో యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు.

టీడీపీ చౌటుప్పల్ మున్సిపల్ జనరల్ సెక్రటరీగా రాజు

చౌటుప్పల్, జూలై 13 : టీడీపీ చౌటుప్పల్ మున్సిపాలిటీ జనరల్ సెక్రటరీగా పట్టణానికి చెందిన సిలివేరు రాజును నియమించారు. ఈ మేరకు శనివారం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి రాజుకు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నియామకపత్రం అందుకుంటున్న రాజు

మోత్కూరులో వైద్యశిబిరం

మోత్కూరు, జూలై 13 : మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ చేసిన వారిపై కేసు

చౌటుప్పల్, జూలై 13 : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి జీస్కేల్ ఎపిటోమ్ వెంచర్‌లో బ్లాస్టింగ్‌కు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన రైతు దంపతులు చెరుకు సత్తయ్య, ధనమ్మ వ్యవసాయ పనులు చేస్తుండగా సదరు వెంచర్ వారు బ్లాస్టింగ్ చేయడంతో రాళ్లు ఎగిరి వచ్చి వారి పొలంలో పడ్డాయి. ధనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

భువనగిరి కలెక్టరేట్, జూలై 13 : అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని ఎర్రంబెల్లి గ్రామానికి చెందిన సైరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబానికి శనివారం పీపీసీఎస్ చందుపట్ల ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. సంఘం సభ్యుల డివిడెండ్ నిధి నుంచి రూ. 30వేలను కృష్ణారెడ్డి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించాలని వినతి

యాదగిరిగుట్ట, జూలై13: వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వివిధ శాఖల్లో పని చేస్తున్న వీఆర్వోలు కోరారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ప్రభుత్వ విప్ సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ వీఆర్వోలు శ్రీశైలం, వెంకట నరసింహారెడ్డి, స్వామి, రమేశ్, శ్రీనివాస్, చారి, బాలయ్య, శేఖర్, యాదగిరి, రంజాన్, శంకర్, ఆంజనేయులు, సురేశ్, కృష్ణ, నర్సింహ, జహంగీర్, ఉపేందర్, సత్తయ్య పాల్గొన్నారు.

బొందుగులలో విద్యార్థులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

రాజాపేట, జూలై 13 : పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని బొందుగుల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు రైస్‌లవ్ స్వచ్ఛంద సంస్థ అందించిన బియ్యాన్ని శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 100మంది విద్యార్థుల కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యం అందించారు. సొంతూరి పాఠశాలకు స్వచ్ఛంద సంస్థ ద్వారా బియ్యం పంపిణీకి కృషి చేసిన మీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్యను ఆయన అభినందించారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఉపాధ్యాయులు ప్రభుత్వ విప్‌కు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్డుతో పాటు చర్చి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ రవి, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మోత్కుపల్లి జ్యోతీప్రవీణ్, మదర్‌డెయిరీ డైరెక్టర్లు గొల్లపల్లి రాంరెడ్డి, అర్కాల గాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నెమిలె మహేందర్‌గౌడ్, నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని చుట్టుకాముడు

తుక్కాపురంలో చుట్టుకాముడు ఆడుతున్న మహిళలు

ఆత్మకూరు(ఎం), జూలై13 : వానలు కురువాలని కోరుతూ మండలంలోని తుక్కాపురం గ్రామస్తులు శనివారం చుట్టుకాముడు ఆడారు. గ్రామ మహిళలు నీళ్ల బిందెలతో తరలివచ్చి గ్రామంలోని ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో చుట్టు కాముడు ఆడారు. వానలు కురువాలని వరుణుడిని కోరుతూ పాటలు పాడారు.

ఫొటో ట్రెండ్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలి

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

ఎక్స్‌పో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్లు

భూదాన్‌పోచంపల్లి, జూలై 13 : ఈ నెల 26, 27, 28 తేదీల్లో హైదరాబాదులో నిర్వహించే ఫొటో ట్రెండ్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీమిడి మాధవరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, కొత్త ఆవిష్కరణతో సుమారు 200 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ ఎక్స్‌పోలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు దోర్నాల గణేశ్, ఉపాధ్యక్షులు సీత శ్రవణ్‌కుమార్, కేమ విష్ణుమూర్తి, కోశాధికారి రవ్వ నవీన్, మాజీ అధ్యక్షుడు గుద్దేటి పాండు, సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చాలి

● ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొల్నుల హరినాథ్

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

రామన్నపేట(వలిగొండ), జూలై13: ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొల్నుల హరినాథ్ ప్రభుత్వాన్ని కోరారు. ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ముదిరాజ్‌ల అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించాలని, చెరువులు, కుంటలపై ముదిరాజ్ కులస్తులకు సంపూర్ణ హక్కులు కల్పించాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి ఆసరా పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బండి రవి, నాయకులు నిమ్మల రవి, భిక్షం, స్వామి, వేల్పుల కృష్ణయ్య, సింగారం శ్రీను, రాజేశ్ పాల్గొన్నారు.

స్నేహితురాలికి పూర్వ విద్యార్థుల చేయూత

స్నేహితురాలికి ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు(ఎం), జూలై13 : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన గజం ఉమారాణి భర్త రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమారాణి స్నేహితులు (2007–08 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు) శనివారం ఆమెను పరామర్శించి, రూ.30వేల ఆర్థిక సాయం అందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది

ఆత్మకూరు(ఎం), జూలై 13 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండలంలోని కూరెళ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి గుర్రం వినోద్‌కుమార్ సూచించారు. శనివారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఎన్ఎం సునీత, అంగన్వాడీ టీచర్లు ధనలక్ష్మీ, మంగతయార్, ఆశాకార్యకర్త చంద్రకళ, వివోఏ వెంకటేశ్ తదితరులున్నారు.